## 171. తీర్పు

ఓ పళ్ళ చెట్టు మీదకి పళ్ళ కోసం వేసిన రాయి వెళ్ళి ఆ పక్కనించి వెళ్ళే శివాజికి తగిలింది. మంత్రి వెంటనే ఆ రాయిని విసిరిన వాడిని పట్టుకుని శివాజి దగ్గరకి తీసుకెళ్ళి విచారించి అతనికి తగిన శిక్ష వేయమని కోరాడు. శివాజి రాయి విసిరిన వాడి వంక చూసి అడిగాడు.

"ఆ చెట్టుని కొడితే నీకు ఎన్ని పళ్ళు దక్కాయి?"

"రెండు పళ్ళు." వినయంగా జవాబు చెప్పాడు అతను.

"అందువల్ల నీకు ఎన్ని గంటల కాలం ఆకలి తీరుతుంది?"

"నాలుగు గంటలు."

"చెట్టుని కొడితేనే నీకు నాలుగు గంటల ఆకలి తీరిందే. మరి రాజైన నన్ను కొడితే నీకు ఎంత ఆకలి తీరాలి? ఇతనికి ఏడాదికి సరిపడే ఆహార పదార్థాలని ఇచ్చి పంపండి." శివాజి తీర్పు చెప్పాడు.

## 172. తేడా

అలహాబాద్‌లోని ప్రభుదత్త మహారాజ్ అనే ఓ మహాత్ముడి దగ్గరకి తరచు ఓ ధనవంతుడి కూతురు వెళ్ళి ఆయన చెప్పే ప్రవచనాలని వినసాగింది. ఇది ఆమె తండ్రికి నచ్చలేదు. ఓ రోజు తండ్రి ఆమెతో చెప్పాడు.

"నాకు స్వంత భవంతి ఉంది. మీ స్వామికీ స్వంత భవంతి ఉంది. నాకు రెండు స్వంత కార్లు ఉన్నాయి. మీ స్వామికీ రెండు స్వంత కార్లు ఉన్నాయి. నాకు బేంక్‌లో డబ్బుంది. మీ స్వామికీ బేంకులో డబ్బుంది. నువ్వు ఆయన దగ్గరకి ఎందుకు వెళతావు? నాకూ ఆయనకి ఏమిటి తేడా?"

ఆమె వెళ్ళి స్వామితో తండ్రి అన్న మాటలని చెప్పింది. ఆయన నవ్వి ఆమె తండ్రిని తీసుకు రమ్మని, ఆయన ప్రశ్నలకి తాను జవాబు చెప్తానని చెప్పాడు. మర్నాడు తండ్రి ఆమె వెంట ఆశ్రమానికి వచ్చాడు.

"నీకు, నాకు మధ్య గల తేడా ఏమిటో తెలుసా? నాకున్న భవంతిని, కార్లని, డబ్బుని ఈ క్షణం నేను విడిచిపెట్టి నడిచి వెళ్ళిపోగలను. ఆ తర్వాత మళ్ళీ ఎన్నడూ వాటి గురించి ఒక్క క్షణం కూడా ఆలోచించను. నువ్వా పని చేయగలవా?" అడిగాడు స్వామి.

ఆ ధనవంతుడు సిగ్గుతో తల వంచుకున్నాడు.

## 173. బానిస

అడవిలో ఏనుగు పిల్లలని వేటగాళ్ళు పట్టుకున్నాక వాటి మెడలకి బలమైన ఇనప గొలుసుని కడతారు. తప్పించుకోడానికి అవి విఫల ప్రయత్నం చేస్తాయి. అలా కొన్ని వారాలపాటు ప్రయత్నించినా తమ మెడలకి కట్టిన గొలుసుల నించి అవి తప్పించుకోలేకపోతాయి. కొంతకాలం తర్వాత ఆ ఏనుగు పిలల్లకి అర్థమవుతుంది, తాము ఎంత లాగినా ఉపయోగం ఉండదని. దాంతో అవి లాగడం, గుంజుకోవడం ఆపేస్తాయి. తమ మెడలకి కట్టిన పట్టీలని తాము తెంచుకోలేము అన్న సంగతి వాటికి అనుభవంతో స్పష్టమవుతుంది.

అలాంటి ఏనుగు పిల్ల పెరిగి పెద్దదయ్యాక దాని మెడని సన్నటి తాడుతో స్థంభానికి కడతారు. ఆ తాడుని అది గట్టిగా లాగితే స్వేచ్ఛగా నడిచి వెళ్ళిపోవచ్చు. కాని అది విడిపించుకునే ప్రయత్నమే అసలు చేయదు. ఎందుకంటే తన మెడకున్నది తెగదన్న అనుభవానికి అప్పటికే అది బానిస అయింది.

ఇదే విధంగా మనం జీవితంలో చాలా విషయాల్లో అనేక అనుభవాలకి బానసలమై ఆ ఏనుగులా ప్రవర్తిస్తూంటాం. ప్రయత్నిస్తే చాలా అలవాట్ల నించి, పరిస్థితుల నించి మనం తేలిగ్గా బయట పడగలం అన్న సత్యం మనకి తెలీకుండానే జీవిస్తూంటాం.